విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

కొల్లేరు సరస్సులో పడవ బోల్తా

ఇద్దరు మహిళల మృతి

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరు మండలం శ్రీపర్రు గ్రామం సమీపంలోని కొల్లేరు సరస్సులో పడవ బోల్తాపడి ఇద్దరు మహిళలు మృతి చెందారు. రూరల్ ఎస్సై లక్ష్మణ్ బాబు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. కొల్లేరులో కూలి పనికి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెప్తున్నారు. కొల్లేరు ప్రాంతంలో అక్రమంగా తవ్వకాలు జరిపే వారు, అక్రమంగా కూలీలను పనికి తీసుకుని వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ప్రమాదం జరిగినట్లు సమాచారం.

పేద కుటుంబాల అభివృద్ధికే సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - కలిదిండి: పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఎస్ అర్ పి అగ్రహారం గ్రామంలో పార్టీ నాయకులు అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టో లో పేర్కొన్న నవరత్నాలే కాకుండా, కొన్ని వర్గాల వారికి లబ్దిని అందించాలని ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. చెప్పిన తేదీకి చెప్పిన మొత్తం నగదును లబ్ధిదారుల ఖాతాలో నేరుగా జమ చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తేజోమణి, ఎంపీడీవో సీతారామ కుమార్, ఈవోపిఆర్డి శ్రావణ్ కుమార్, ఏపీవో ఆనంద్, జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - నిడమర్రు : 2023 సంవత్సరమును ఐక్య రాజ్య సమితి మిల్లెట్స్ ఇయర్ చిరుధాన్యాల సంవత్సరం ప్రకటిం చిన నేపథ్యంలో చిరుధాన్యాల ప్రాముఖ్యతను మనం తీసుకునే ఆహారంలో వాటి ప్రాధాన్యతను విద్యార్థులకు అవగాహన కల్పించవలసినదిగా పాఠశాల విద్యా శాఖ వారు ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రమైన నిడమర్రు ప్రభుత్వ హైస్కూల్ నందు చిరుధాన్యాలతో విద్యార్థినీలు వివిధ రకాల రుచికరమైన వంటకాలను తయారు చేసి, ప్రదర్శించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యర్రంశెట్టి శేషగిరి రావు తెలియజేసారు. ఈసందర్భంగా విద్యార్థినిలను అయన అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఐసీఎం 125వ వార్షికోత్సవం

విశాలాంధ్ర - ఏలూరు : ఇండియన్ క్రిస్టియన్ మిషన్ (ఐసీఎం) 125వ వార్షికో త్సవ వేడుకలను మంగళవారం ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న ఆల్ సెయింట్స్ ఐసీఎం చర్చ్ కథెడ్రల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. బిషప్ మోస్ట్ రెవరండ్ డాక్టర్ జాన్ ఎ' రాజు ఆధ్వర్యంలో తొలుత నగరంలో పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏసుక్రీస్తు టవర్‌ను ప్రారంభించారు. అనంతరం వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ, రెవరాండ్ గెరా హనోక్, ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, ఏపీ స్టేట్ లేబర్ వెల్ఫేర్ బోర్డ్ వైస్ ఛైర్మన్ దయాల నవీన్బాబు, ఐసీఎం చర్చిస్ ట్రస్ట్ బోర్డు డయాసిస్ ట్రెజరర్ టి. యేసురత్నం, డయోసిస్ కార్యదర్శి ఎస్.వై.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

పశువులు ఆరోగ్యంగా ఉంటే పాడి ఉత్పత్తి పెరుగుదల

విశాలాంధ్ర - లింగపాలెం : పశువులు ఆరోగ్యంగా ఉంటే పాల ఉత్పత్తి పెరుగుతుందని పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టి.ఆర్.ప్రసాద్ తెలిపారు. ధర్మాజీ గూడెం పశువుల ఆసుపత్రిలో ఈయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్యంపై సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. తన పరిధిలోని ముసునూరు, కామవరపుకోట, లింగపాలెం మండలాల్లో 12 పశు వైద్యశాలలు ఉన్నాయని, వీటి పరిధిలో పశువుల అభివృద్ధికి సిబ్బంది చేయాల్సిన విధులు క్రమబద్ధంగా జరిగేలా చూస్తానని అన్నారు. గోపాలమిత్ర సిబ్బంది సేవలు పాడి రైతులకు ఆదర్శంగా ఉండాలని అన్నారు.

అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో (ఎస్ఈబి)కార్యాలయంలో ఖాళీగా వున్న ఔట్ సో ర్సింగ్ పోస్టుల భర్తీ కొరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అసిస్టెంట్ కమిషనర్ వై. శ్రీనివాస్ చౌదరి ఒక ప్రకటనలో కోరారు. తమ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఒక జూనియర్ అసిస్టెంట్ పోస్టును బీసీ (డి) మహిళలకు కేటాయించినట్టు చెప్పారు. ఇందుకోసం డిగ్రీ ఉత్తీర్ణులై,కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. మూడు ఆఫీస్ సభార్డినేట్ పోస్టులకు సంబంధించి ఓసి మహిళ, ఎస్సి మహిళ ,ఓసీలకు ఒక్కొక్క పోస్టు కేటాయించినట్టు చెప్పారు. ఈనెల 30వ తేదీలోగా అసిస్టెంట్ కమిషనర్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో, డోర్ నెంబర్ 8-96, శాతవాహన నగర్ శనివారం పేట, ఏలూరు చిరునామాకు రిజిస్టర్ పోస్టు ద్వారా కుల ధృవీకరణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్ల కాపీలను జతపరిచి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆసుపత్రిలో పెన్షన్ అందజేత

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలంలో పరింపూడి గ్రామానికి చెందిన మాగంటి వెంకన్న కొద్ది రోజుల నుండి తూర్పుగోదావరి జిల్లా రాజ మండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నాడు. వెంకన్నకు పెన్షన్ ఇవ్వటానికి వలంటీర్ ఊసల రిబ్కా వెంకన్న ఇంటికి వెళ్ళగా రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో అనారోగ్య కారణంగా చికిత్స పొందుతున్నాడని తెలపడంతో మంగళవారం వలం టీర్ రిబ్కా ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న వెంకన్నకు పెన్షన్ అందజేయడంతో వెంకన్న కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. రిబ్కా ను పలువురు అభినందించారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లా లోని డీపీహెచ్, కుటుంబ సంక్షేమం, ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ వారి ఆధీనంలోని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను ఒక సంవత్సర కాలమునకు కాంట్రాక్ట్ విధానంలో భర్తీచేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

- జిల్లాను అన్ని రంగాల్లో ప్రథమస్థానంలో నిలపాలి
- జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర - ఏలూరు : అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరం వద్ద మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. అనంత రం పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అమరజీవికి నివాళులు అర్పించిన వారిలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. అరుణ్ బాబు, అధనపు ఎస్పీ కె. చక్రవర్తి, విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్, డిఆర్వో ఎవివి సత్యనారాయణమూర్తి, ఏలూరు ఆర్డిఓ కె. పెంచల కిషోర్ లతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సెయింట్ థెరిస్సా పాఠశాల విద్యార్థినులు మా తెలుగుతల్లికి మల్లె పూదండ గీతాలాపన చేశారు. జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధనకోసం అహర్నిశలు కృషిచేసి ఆంధ్రరాష్ట్ర ఆవిర్భావానికి శ్రీకారం చుట్టిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు అజరామరమని అన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం చేసిన జిల్లాల పునర్విభజన అనంతరం తొలిగా ఏలూరు జిల్లాలో నిర్వహించుకుంటున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం స్ఫూర్తిగా ఏలూరు జిల్లాను అన్ని రంగాల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరూ దీక్ష వహించాల న్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి. అరుణ్ బాబు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని 58 రోజులు కఠిన నిరాహారదీక్షచేసి ప్రాణత్యాగం చేశారన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్.టి.సి. పిఆర్వో నరసింహారావు వ్యాఖ్యాతగా వ్యవహరిం చారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఓ కె.వి. రవికుమార్, ఏలూరు డిఎస్పీ జి. పైడేశ్వర రావు, డిఆర్డిఏ పిడి విజయరాజు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ జి. శ్యాంబాబు, పశుసంవర్ధకశాఖ జెడి డా. జి. నెహ్రూబాబు, డిఇఓ గంగాభవాని, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం ఏసుదాసు, డ్వామా పిడి డి. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం టౌన్‌లో : సమాజంలో ప్రజల కోసం చేసే త్యాగాలకు స్ఫూర్తిదాయకం అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల లు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యుల కలలు సాకారం చేయడానికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. ఏ ప్రభుత్వమైనా విజయం సాధించాలంటే ప్రజల సంతోషం, సంక్షేమమే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహ రాజు, జడ్పీటిసి కాండ్రేగుల నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, డిఈ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో : ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా మండలంలో చొప్ప రామన్నగూడెం మెయిన్ సెంటర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి గవరవరం వైయస్సార్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శీమకుర్తి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు శాంతియుతంగా దీక్ష చేపట్టి ఆంధ్ర రాష్ట్ర సాధనకు కృషి చేశారని కొనియా డారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య కార్యవర్గ సభ్యుడు బొమ్మ సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బొమ్మ శ్రీను, మోత్కూరి శ్రీను, గణేష్, గవరవరం, చొప్ప రామన్నగూడెం గ్రామాల ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెదవేగిలో :ఏలూరుజిల్లా , పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పెదవేగి ఎంపిపి తాతా రమ్య, ఎం పిడిఓజి రాజ్ మనోజ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి జాతీయ జెండాను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు.

జంగారెడ్డిగూడెంలో : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అమరజీవి పొట్టిశ్రీరాములు అని ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ మాజీ ఉపాధ్య క్షుడు చిన్ని రామ సత్యనారాయణ అన్నారు . స్థానిక బుట్టాయగూడెం రోడ్డులో ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు పూల మాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా పలువురు ఆర్యవైశ్య నాయకులు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజలు ఉన్నంతకాలం వారి హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఫణి కుమార్,దారా రవి, టీ.వీ. ఏ.రామ తారకం,గుడిమెట్ల యుగంధర్, మామిడి సురేష్, చిన్ని సాయి కుమార్,బొడ్డు సత్యనారాయణ, కర్పూరం వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - పెంటపాడు : ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ అలుపెరగని పోరాటం చేసి బలోపేతానికి కృషి చేయా లని సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. మంగళ వారం ఆకుతీగపాడులో కొణతాల నాగరాజు గృహంలో సీపీఐ పెంటపాడు మండల సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అప్పారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేసి పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు . ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో సంపన్న పెట్టుబడిదారులకు దోచిపెడుతున్న మోడీ విధానాలను తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పరిపాలన అస్తవ్యస్తంగా తయారయ్యిందన్నారు. సీపీఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు గతంలో ఉన్న అనేక సంక్షేమ పథకాలను తిలోదాకాలిచ్చి నవ రత్నాలు పేరుతో సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రజలను మభ్యపెడుతున్నా రన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల సంస్థ సభ్యులు బి లక్ష్మీనారాయణ, వంక రామకృష్ణ, కొనసాల నాగరాజు, దిద్దే నాగేశ్వరరావు, డి. వెంకట్ రాజు, కె. రాజు, ఎ. వెంకటేశ్వరరావు, జె. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ వద్దు

- పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం
- త్వరలో అఖిలపక్ష కమిటీ ఏర్పాటు



విశాలాంధ్ర- నరసాపురం: నరసాపురం మండలం రుస్తుంబాద పంచాయతీ పరిధిలో నరసాపురం మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డును ఏర్పాటు చేయొద్దని పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీ వంగా తీర్మానించింది. మంగళ వారం గ్రామ సర్పంచ్ బందెల భారతి రవీంద్ర అధ్యక్షతన పంచాయతీ కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. పంచాయతీ పరిధిలోని మండా వారి గరువులో 4.20 ఎకరాల విస్తీర్ణంలో నరసాపురం మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డును ఏర్పాటు చేయనున్నారని దీనివల్ల తమ ప్రాంతం కాలుష్యంగా మారిపోతుంది అని అందుచే డంపింగ్ యార్డ్ ఏర్పాటును అడ్డుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరడంతో ఈ తీర్మానం చేసారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తుల అభీష్టం మేరకు వారి మనోభావాలకు అనుగుణంగా పంచాయతీ పాలకవర్గం ముందుకు వెళుతుందన్నారు. గ్రామ మాజీ ఉప సర్పంచ్ కాసా సత్యనారాయణ,గ్రామ పెద్దలు యడ్లపల్లి తాతాజీ, పులి శ్రీరాములు,మండా రత్తాలు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ ఎట్టి పరిస్థితిలో తమ గ్రామంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కానివ్వమన్నారు. ఇదే సమస్యపై సబ్ కలెక్టర్,జిల్లా కలెక్టర్ లకు వినతి పత్రాలు అందజేస్తామన్నారు . గ్రామస్తులతో చర్చించామని త్వరలోనే అఖిలపక్ష కమిటీలను ఏర్పాటు చేసుకొని డంపింగ్ యార్డ్ ఏర్పాటును అడ్డుకుంటామని వారు తెలిపారు.

గడపగడపకు ఎమ్మెల్యే

విశాలాంధ్ర - లింగపాలెం : వేములపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా ఇంటింటికి తిరిగారు. గ్రామంలోని ప్రజలతో మాట్లాడారు. ప్రతీ ఇంటికి వెళ్ళి ప్రభుత్వం ఇస్తున్న పథకాలు అందుతున్నాయా అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి సంక్షేమ పథకాలు వస్తున్నాయని జవాబు రావటంతో ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలోనిపలు సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిని పరిష్కరిస్తానని తెలిపారు. 57వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఈ గ్రామంలో జరిగింది. మండల పరిషత్ అధ్యక్షురాలు ముసునూరు వెంకటలక్ష్మి, ఎంపిడిఓ ఆశీర్వాదం, మండల పార్టీ అధ్యక్షులు ముసునూరి వెంకటేశ్వరరావు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల జాతీయ మహాసభలు విజయవంతం చేయండి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : అఖిలభారత భవననిర్మాణ కార్మిక సంఘాల జాతీయసమాఖ్య 7వ మహాసభలను విజయవంతం చేయా లని కోరుతూ పశ్చిమ గోదావరి జిల్లాలో విస్తృత ప్రచారం ప్రారంభ మైంది. ఏఐటీ యూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మికసంఘాలు జిల్లా అంతటా కరపత్రాలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఒకటో తేదీన నెలవారీ సమావేశాలు నిర్వహించే సందర్భంగా మంగళవారం వివిధ ప్రాంతాల్లో జాతీయ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. తాడేపల్లిగూడెం ఏరియా తాపీ వడ్రంగి, సెంటరింగ్, రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పాలూరి లక్ష్మణరావు,జిల్లా ఉపాధ్యక్షుడు అంకం భాస్కరరావు, జిల్లా కోశాధికారి మెండెం జేమ్స్, ఏరియా కమిటీ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, గౌరవాధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు, కోశాధికారి కాకర్ల రాంబాబు, యూనియన్ నాయకులు రెడ్డి శ్రీనివాస్, రెడ్డి మురళీకృష్ణ , జిల్లా కార్యవర్గ సభ్యుడు కోడె సాయి బాలాజీ , తదితరులు సోమ ,మంగళ వారాల్లో మేస్త్రిలకు కరపత్రాలను అందచేశారు. తాడేపల్లిగూడెం మండలం ఎల్. అగ్రహారం గ్రామంలో భవననిర్మాణ కార్మికసంఘం సమావేశం మంగళవారం సంఘం అధ్యక్షుడు పాలూరి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది.జిల్లాసంఘ ఆర్గనైజింగ్ కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ మాట్లాడుతూ నవంబర్ 26,27,28 తేదీల్లో రాజమండ్రిలో జరగనున్న జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. 26 వ తేదీ జరిగే ర్యాలీకి సభ్యులు భారీఎత్తున తరలిరావాలని కోరారు. ప్రమాదవశాత్తూ గాయపడిన యూనియన్ సభ్యుడు సుంకర రాంబాబుకు యూనియన్ తరపున రూ.2500 ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కోడె సాయిబాలాజీ, సంఘం కార్యదర్శి దెయ్యం పాండు రంగ,దంగేటి నారాయణరావు, బసివిరెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు. మాధవరంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడు గంధం సత్యనారాయణ, కార్యదర్శి సిద్దిరెడ్డి సత్యనారాయణ, నవాబుపాలెం గ్రామంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడు రుద్రా శ్రీను, బండి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. రాజమండ్రి తరలివెళ్ళాలని ఆయా సమావేశాల్లో నిర్ణయించారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి



విశాలాంధ్ర - చింతలపూడి : స్వచ్ఛభారత్ కార్మికులకు జీవో నెంబర్ 680 ప్రకారం రూ.10, 000 జీతం ఇవ్వాలని ఏఐటీ యూసీ చింతలపూడి ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు కంకిపాటి బుచ్చిబాబు, తొర్లపాటి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద స్వచ్ఛభారత్ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో మణి కుమారికి అందజేశారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు, బాబు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి పదివేల రూపాయల జీతం ఇస్తామని చెప్పి 680 జీవోను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం దానిని అమలు చేయడంలో విఫలం చెందిందన్నారు. తక్షణం వీరికి పది వేల రూపాయల జీతం ఇవ్వాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా నాయ కులు చేపల్లి శ్రీనివాసరావు, సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య స్వచ్ఛభారత్ కార్మికులు ఎం. కాంతారావు, తగరం రాము, జి. సురేష్, నున్న బుచ్చమ్మ, పిల్లిం సామ్రాజ్యం, వల్లం చిలకయ్య, కె. కృష్ణ, దుక్కుపాటి జాన్, యామర్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల దుకాణాల తొలగింపు అన్యాయం

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల : మండల కేంద్రమైన ద్వారకాతిరుమల లింగయ్య చెర్వుగట్టుప్రక్కన ఉన్న సుమారు 30 చిన్న చిన్న దుకాణాలను పంచాయతీ అధికారులు మంగళవారం తొలగించారు. గత కొన్ని సంవత్సరాలుగా ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కల్గించకుండా కాఫీహోటళ్ళు, టీదుకాణాలు, కూరగాయలు, నిమ్మకాయలు, ఇతర పండ్లదుకాణాలను తాత్కాలికంగా ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రతి దుకాణదారుడు పంచాయతీ రోజువారి పాటదారునికి రూ.50లు చెల్లిస్తున్నారు. దీంతో చిరువ్యాపారులు పంచాయతీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం మొబైల్ వ్యాన్‌లు, రోడ్డుప్రక్క తాత్కాలిక దుకాణాలు ఏర్పాటుచేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. తమకు న్యాయం చేయకపోతే ఆందోళన చేస్తామని ఉన్నతాధికారుల వద్దకు వెళ్తామని హెచ్చరించారు.

సచివాలయాల సందర్శన

విశాలాంధ్ర - పెదవేగి : పెదవేగి మండలం లోని మండూరు, చక్రాయ గూడెం సచివా లయాలను ఎండిఓ జి. రాజ్‌మనోజ్ సోమవారం సందర్శిం చారు. గ్రామాలలో సచివాలయాల ద్వారా ఉద్యోగులు ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల ఉద్యోగుల విధి విధానాల పై దిశా నిర్దేశం చేశారు. గ్రామాలలో ముఖ్యంగా వృద్ధులకు, దివ్యాంగులకు, వితం తువులకు, ఒంటరి మహిళలకు అందుతున్న పింఛన్ల వివరాలు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఎండిఓ సచివాలయ ఉద్యోగులకు సూచించారు. గ్రామాలలో నిరుపేదల వివరాలు వారికి అందుతున్న సంక్షేమ పథకాలు, అందని వారి వివరాల జాబితాలు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఎంతమంది రైతులకు రైతు భరోసా అందుతుందనే వివరాలన్నింటిపై సచివాలయ ఉద్యోగులు చేసిన సర్వేలను ఉద్యోగుల విధులకు సంబంధించిన హాజరును ఎండిఓ రాజ్ మనోజ్ పరిశీలించారు.

పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

విశాలాంధ్ర- నరసాపురం: నర్సా పురం పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్య వర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నర్సాపురం పాత బజార్ చిన్న మసీదు సమీపములోని జె బి ఎంటర్ప్రైజెస్ ఆవరణలో గౌరవ అధ్యక్షులు పర్వతం సత్య నారాయణ, గుత్తి కొండ మోహనరావుల అధ్యక్షతన సమావేశం జరిగింది. నూతన కార్యవర్గానికి అధ్యక్షులుగా పిండి ఆదినారాయణ, ఉపాధ్యక్షులుగా దాసిరెడ్డి నాగేశ్వరరావు, కార్యదర్శిగా తొత్తరమూడి శ్యాంబాబు, సహాయ కార్యదర్శిగా చదలవాడ రాజు, కోశాధికారిగా డీకాల సుధాకర్ ఎన్నికయ్యారు. సభ్యులుగా ఈవన శ్రీను, కొండేటి కల్వర్, గెద్దాడ నాగరాజు, మారెళ్ళ వెంకటరత్నం, కన్వీనర్‌గా గెద్దాడ సతీష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలో రూ. 90 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఉంగుటూరు నియోజకవర్గ శాసన సభ్యులు పుప్పాల వాసు మంగళవారం భూమి పూజ చేశారు. దొంతవరం గ్రామంలో రూ. 9 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి, కాగుపాడు గ్రామంలో రూ.11 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి, బాదంపూడి గ్రామంలో రూ.20 లక్షలతో మంచి నీటి సరఫరా కొరకు గోదావరి కాలువ నుండి పైప్‌లైన్ నిర్మాణం పనులకు,వెల్లమిల్లి గ్రామంలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.50 లక్షలతో వాటర్ ట్యాంక్, పైప్ లైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే వాసు బాబు శంకుస్థాపన చేశారు. దొంతవరం, కాగుపాడు, బాదంపూడి, వెల్లమిల్లి గ్రామాల సర్పంచులు కంభంపాటి సత్యవతి, కడియాల సుధీప్త, కంకట పద్మ లీల, వస్కో కుమార్ రాజు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ జయలక్ష్మి, ఎంపీడీవో ప్రేమాన్విత, ఏఎంసీ మాజీ చైర్మన్ రమావతి, గోపీనాథ్ పట్నం సర్పంచి విష్ణుమూర్తి, మండల పరిషత్ విప్ డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ, జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి పుప్పాల గోపి, అధికారులు, ఆయా గ్రామ ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి గడప గడపకు

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రజా సమస్యలు పరిష్కరించడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వ హిస్తున్నామని పోలవరం నియోజకవర్గ శాసన సభ్యులు తెల్లం బాల రాజు అన్నారు. వెలగపాడు పంచాయతీలోని వీరభద్ర వరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళ వారం గడప గడపకు వెళ్ళి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు,ఎంపీపీ డి. లక్ష్మి, వైసీపీ మండల కన్వీనర్ శ్రీనురాజు,వాసిరెడ్డి మధు, దేవరపల్లి సీతా రామ ప్రసాద్, బొడ్డపాటి రాంబాబు,ఉమ్మడి తేజ, నందియ్య,బొడ్డు శ్రీనుతదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధిపై ఎమ్మెల్యే గ్రంధి సమీక్ష

విశాలాంధ్ర - భీమవరం: పట్టణంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులపై, అదే మాదిరిగా ప్రభుత్వ ఆమోదం కొరకు పంపిన పనుల జాబితా పై ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల వారీగా అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆమోదం పొంది టెండర్ ప్రక్రియ ముగిసిన తర్వాత కూడా ఎక్కడెక్కడ పనులు ప్రారంభించాల్సి ఉంది అనే దానిపై అధికారులను ఆరా తీశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎస్. శివరామకృష్ణ, ఎంఈ త్రినాధరావు, డిఈ రాజారావు ,ఏఈ శ్రీనివాస్, కృష్ణమూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

కాపుల అణచివేతకు ముఖ్యమంత్రి కుట్రలు

విశాలాంధ్ర - ఏలూరు : అధికారంలోకి వచ్చిననాటినుండి కాపులను అణచివేయ డమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వైసీపీలోని కాపునేతలు ఊడిగం చేయడం కాపుజాతికే సిగ్గుచేటని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బడేటి చంటి విమర్శించారు. కాపులను చిన్నచూపు చూస్తున్న జగన్ రెడ్డికి ప్రతి కాపు సోదరుడు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. స్థానిక పవర్ పేటలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజమహేంద్రవరంలో వైసీపీలోని కాపునాయకులు రాష్ట్రంలోని కాపులందరూ వైసీపీ ప్రక్కనే ఉన్నట్లు చూపించే ప్రయత్నం చేయడాన్ని తాము ఖండిస్తున్నట్లు బడేటి చంటి పేర్కొన్నారు. తుని, అమలాపురం ఘటనలతో రాజకీయ పబ్బం గడుపుకోవాలని భావించిన వై.సి.పిలో బానిసలుగా బ్రతుకుతున్న కాపునేతలు ఇప్పటికైనా కళ్ళు తెరవాలని ఆయన సూచించారు.

బాలికలు క్రీడలపట్ల ఆశక్తి పెంచుకోవాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం: బాలికలు క్రీడల పట్ల ఆశక్తి పెంచుకోవాలని మక్కిన వారిగూడెం సొసైటీ చైర్ పర్సన్ పిన్నమనేని చక్రవర్తి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలవరం నియోజక వర్గ స్థాయి స్కూల్ గేమ్స్ (కబడ్డీ,ఖోఖో) ఎంపిక పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో ఎంపికైన 400 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. నియోజక వర్గ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి ఎంపికలో పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి. ప్రసాద్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ టి. నాగమణి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి డి. రాజేంద్ర ప్రసాద్, నియోజకవర్గ ఇన్‌చార్జి కె. నాగేశ్వరరావు, పిన్నమనేని రాధాకృష్ణ,శ్రీ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గంగయ్యకు సీపీఐ నాయకుల పరామర్శ

విశాలాంధ్ర - తణుకు : సీపీఐ నాయకుడు కొమ్మిశెట్టి గంగయ్యను సీపీఐ పెంటపాడు మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, పార్టీ నాయకులు వంక అప్పారావు, బి.లక్ష్మినారాయణ, కొణతల నాగరాజు లతో కలిసి పరామర్శించారు.

క్లస్టర్ పారిశ్రామిక వేత్తలు యంయస్ఈ - సిడిపి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - ఏలూరు : రాష్ట్రంలో మైక్రో స్మాల్ ఎంటర్ ప్రైజస్‌ను (ఎంఎస్ఇఎస్) ప్రోత్సహించే నిమిత్తం కేంద్ర ప్రభుత్వాల ఎం.ఎస్.ఇ -సి.డి.పి. (ఎంఎస్ఇ - సిడిపి) అనే రాష్ట్ర పథకాన్ని అమలు చేస్తున్నాయని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పి.ఏసుదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంలో ఉమ్మడి సౌకర్య కేంద్రాలను ఏర్పాటు చేయడం (సిఎఫ్‌సి) ప్రస్తుతం వున్న ఎంఎస్ఇల స్థిరత్వం , పోటీతత్వాన్ని పెంపొం దించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కామన్ ఫెసిలిటి సెంటర్ (సిఎఫ్‌సి) లను ఏర్పాటు చేయాలంటే స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పివి) ను ముందుగా ఏర్పాటుచేసుకోవాలన్నారు. ఈ ఎస్ పి వి లను కంపెనీల చట్టం సెక్షన్ 8 క్రింద నమోదు చేసుకోవాలన్నారు . జిల్లాలోని క్లస్టర్ పారిశ్రామిక వేత్తలు యంయస్ఈ - సిడిపి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో తెలియజేశారు.

రవాణా కార్మికుల పొట్ట కొడుతున్న పాలకవర్గాలు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ప్రభుత్వాలు ఉపాధి చూపించకపోయిన స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకుని కుటుంబాలను నెట్టుకొస్తున్న రవాణా కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ఫీజులు,చలానాలతో వేధించడం సిగ్గుచేటని సిఐటియు జిల్లా కార్యదర్శి కొక్కిరిపాటి వెంకట్రావు విమర్శించారు. ఈమేరకు డా. బి.ఆర్. అంబేద్కర్ ట్రాలీ ఓనర్స్ /డ్రైవర్స్ యూనియన్ విస్తృత సమావేశం మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆ సంఘం అధ్యక్షులు టేకి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. రవాణారంగం నుంచి కార్మికులను దూరం చేసి కార్పొరేట్ పరం చేయడానికి కేంద్రప్రభుత్వం మోటర్ వాహనాల చట్టాన్ని సవరించిందన్నారు. ప్రభుత్వం తన తప్పుల్ని కప్పిపుచ్చుకోవడానికి మానవతప్పిదాల వలనే రోడ్లపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయనడం సరైనది కాదన్నారు. డ్రైవర్ల మెడకు ఉరితాడుగా మారబోతున్న ఈ చట్టాన్ని రద్దు చేయాలని వెంకట్రావు కోరారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.నం.27ను తక్షణమే రద్దు చేయాలని,సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలోని హెచ్.గోపీచంద్,ఎ.కాశీవిశ్వనాధం,కె.వెంకటరాజా,రౌతు పురుషోత్తం, పి.రాజు, ఎస్.రాంబాబు,దారం వెంకట్రావు,షేక్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థుల ఫీల్డ్‌ట్రిప్

విశాలాంధ్ర - తణుకు : స్థానిక నారాయణ పాఠశాల విద్యార్థులు మంగళవారం ఫీల్డ్ ట్రిప్ లో భాగంగా పట్టణ రైల్వే స్టేషన్, వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపా ధ్యాయులు కె.సత్యనారాయణ విద్యార్థులచే వృద్ధులకు పళ్ళు, ఫలహారాలను పంపిణీ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృద్ధులను గౌరవించడం, వారికి సేవలు చేయడం, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం కనీసం మానవత్వం అని, నేటి యువతరం తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్య ధరణితో వ్యవహరిస్తున్నారని, తల్లిదండ్రులను చూడడం పిల్లలుగా మన ప్రథమ కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏ.జీ.ఎం రామ్ రెడ్డి, ఏవో నవకుమార్, కోఆర్డినేటర్ రాణి, వైస్ ప్రిన్సిపల్ వెంకటరమణ, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనసేన పాదయాత్ర అవహేళన

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : జనసేన చేస్తున్న తాడేరు వంతెన నిర్మాణం పాదయాత్రను ప్రజలు అవహేళన చేస్తున్నారని, అతి త్వరలో తాడేరు వంతెన శంకుస్థాపన ఆహ్వానం పంపుతాం హాజరుకావాలని ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహ రాజు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పై బురద జల్లడానికి జనసేన జిల్లా అధ్యక్షుడు చినబాబు పాదయాత్ర చేపట్టారే తప్ప వంతెన నిర్మాణం కోసం కాదని, వంతెన నిర్మించాలని 12వ వార్డు కౌన్సిలర్ యర్రంశెట్టి చందు 2016లో చినబాబు ఛైర్మన్ గా ఉండగానే వినతిపత్రాన్ని అందజేశారని, నాడు అధికారంలో ఉండి వంతెన నిర్మాణం పట్టించుకొని వారు నేడు పాదయాత్ర చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ వంతెన నిర్మాణ ప్రారంభోత్సవానికి మిమ్మల్ని కూడా పిలుస్తామని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి కండ్రేకుల నరసింహారావు, మాజీ కౌన్సిలర్ యర్రంశెట్టి చందు, తుందుర్రు సర్పంచ్ అరేటి సత్యనారాయణ ,నామన మహేష్, కోమటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్యశాలకు బల్ల, పీట బహూకరణ

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు ప్రభుత్వ ఆయుష్ వైద్యశాలకు కైకరం గ్రామానికి చెందిన రాజు కుమారుడు ఎనిమిది వేల రూపాయలు ఖరీదు చేసే బల్ల పీట ఇచ్చారని తల్లాప్రగడ భీమేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా దాతను పలువురు అభినందించారు. ఉంగుటూరు ఆయుష్ వైద్యశాలలో పంచకర్మ వైద్యం ప్రారంభించడంతో దాతలు ముందుకొచ్చి పరికరాలు అందజేయటం పలు అభినందించారు.

సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ముసునూరు: ఈనెల19,20వ తేదీల్లో జిల్లా కేంద్రం ఏలూరులో జరుగు సిఐటియూ జిల్లామహాసభలకు ప్రతి ఒక్కరు హాజరుకావాలని జిల్లా సిఐటియూ నాయకులు జి.రాజు అన్నారు. మంగళవారం ఆయన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ సిఐటియూ జిల్లా మహాసభలకు ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడిలు,భవననిర్మాణకార్మికులు,రోజువారికూలీలు,బిల్డింగ్ వర్కర్లు, మధ్యాహ్న భోజనం స్కీం వర్కర్లు, ప్రతి ఒక్కరు హాజరుకావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పిల్లి మురళి వున్నారు.

వీఆర్వోలపై పని భారం తగ్గించండి

విశాలాంధ్ర-నరసాపురం: వీఆర్వోల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం నరసాపురం వీఆర్వోలు తహసీల్దార్ ఫాజిల్ కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.వీఆర్వోల పై పని భారం తగ్గించాలని రెవిన్యూకు సంబంధం లేని పనులు అప్పగించరాదని, భూ రీ సర్వేకు సంబంధించి అయ్యే ఖర్చులను ముందుగానే వీఆర్వోలకు అందివ్వాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వినతి పత్రం అందించిన వారిలో వీఆర్వోల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎమ్ లక్ష్మీనారాయణ,నరసాపురం డివిజన్ అధ్యక్షుడు సత్తిబాబు, నర్సాపురం రూరల్,అర్బన్ వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ వ్యతిరేక విధానం అమలు చేస్తున్న ప్రభుత్వం

విశాలాంధ్ర- జంగారెడ్డిగూడెం: ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం పూర్తిగా ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాన్ని అమలుపరుస్తున్నదని, ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు.మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ను ఆయన సందర్శించారు.ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడా జగ్గారావు ఎమ్మెల్సీ ఇళ్లకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ ఇళ్ల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను నిరంతరం మోసం చేస్తోందని పి.ఆర్.సి తో నిరాశపరిచిందని, డి ఏ లు ఇవ్వకుండా తాత్సారం చేస్తోందని అన్నారు . ఈ గడ్డు సమయంలో అందరూ కలిసికట్టుగా ఉండి ఉద్యమ నాయకులకు సహకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ అసిస్టెంట్ సుధాకర్ రెడ్డి , స్టాఫ్ సెక్రటరీ కట్టా శ్రీను ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకులకు ఆదర్శం జగన్మోహన్‌రెడ్డి

విశాలాంధ్ర - ఉండి : పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు 98% హామీలను నెరవేర్చి దేశంలోని మిగిలిన రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆదర్శంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నిలిచారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహారాజు అన్నారు. మంగళవారం ఉండి మండలం పాములపర్రులో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాల తర్వాత ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకోవడానికి ప్రజల వద్దకు వచ్చామన్నారు. పాములపర్రు శివారు కొండగూడెం ప్రాంత ప్రజలు ఎస్టీ సర్టిఫికెట్ల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్న ఫలితం లేకపోతుందని అందువలన ప్రభుత్వ నుంచి లభించే సంక్షేమ పథకాలు అందట్లేదని తమ సమస్య పరిష్కారం కోసం సచివాలయం చుట్టూ తిరుగుతుంటే సచివాలయ సిబ్బంది పట్టించుకోవట్లేదని పివిఎల్ కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కేసన శాంతి కుమారి బలుసులరావు, మునుకోలు సింహాచలం, కరిమెరక రామ చంద్రరావు, ఏడిద వెంకటేశ్వరరావు, పెన్మెత్స ఆంజనేయరాజు, మాజీ సర్పంచులు తాటిపర్తి పెదవీరప్ప, నక్కా చెన్నకేశవరావు, గుండాబత్తుల సుబ్బారావు, వర్రే ముసలయ్య, బొచ్చు అచ్చారావు, గలావిల్లి ధనుంజయ, సురవరపు వెంకటాచార్యులు, మున్నలూరి శ్రీనివాసరావు, బడుగు బాలాజీ, మల్లువలస సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక పద్ధతిలో విధులు నిర్వర్తించేలా చర్యలు

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరులోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు కేటాయించిన ప్రొఫెసర్ స్థాయి వైద్యులను తాత్కాలిక పద్ధతిలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ వైద్యశాలల్లో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయాధికారి, జిల్లా ప్రధాన ఆసుపత్రి వైద్యులు, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్స్ తో కలెక్టర్ వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఏలూరులో త్వరలో ఏర్పాటుకానున్న మెడికల్ కాలేజ్ కి 25 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ను రాష్ట్ర ప్రభుత్వం నియమించిందన్నారు. వీరిని తాత్కాలిక పద్ధతిలో జిల్లాలోని వైద్యులు కొరత కలిగిన ప్రభుత్వ ఆసుపత్రిలలో వీరి సేవలను వినియోగించు కొనేందుకుగాను చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ఆసుపత్రిసేవల సమన్వయాధికారి డాక్టర్ ఏ వి.ఆర్. మోహన్, ఏలూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్ కుమార్, ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వరరావు, ప్రభృతులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో ట్రాఫిక్ జామ్

విశాలాంధ్ర-ఉంగుటూరు : మండల కేంద్రమైన ఉంగుటూరులో మంగళవారం రాత్రి ట్రాఫిక్ జామ్ అయ్యింది వాహనదారులు, ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. టోల్గేట్ పన్ను తప్పించుకోవడం కోసం వాహనదారులు ఉంగుటూరు వంతెన పైనుంచి రాకపోకలు సాగించడం వలన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. తాడేపల్లిగూడెం, ఏలూరు వైపుల నుంచి వచ్చే వాహనదారులు ఉంగుటూరు వంతెన నుంచి వెళ్లడం, రావడం వలన ట్రాఫిక్ జామ్ జరిగింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

పౌరసేవల్ని మెరుగుపర్చాలి

విశాలాంధ్ర-మండవల్లి: గ్రామ సచివాలయాల్లో పౌరసేవలను మెరుగుపరచు కోవాలని సచివాలయ ఉద్యోగులకు ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గా ప్రసాద్ దిశానిర్దేశం చేశారు. మండల పరిషత్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం,పారిశుధ్య నిర్వహణ,సచివాలయాల్లో పౌరసేవలు విస్తృతం చేయటం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ప్రజలకు అందించే సౌకర్యాల్లో రాజీ పడవద్దని ఉద్యోగులకు సూచించారు.సమావేశంలో ఇంచార్జి ఎండివో పి.మల్లీశ్వరి, ఈవోపిఆర్డి రాధిక, మండలపరిషత్ ఏవో శ్రీనివాస్ ,పిఆర్ఏఈ శ్రీనివాసరావు, జూనియరు అసిస్టెంట్లు పావని, వెంకట్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. వాలంటీర్ల ఖాళీల భర్తీలో భాగంగా ఇరువురు వాలంటీర్లకు నియామక పత్రాలు సమావేశంలో అందించారు.

కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసింది టీడీపీనే

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కాపులను గుర్తించి కాపులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వమే అని బయ్యనగూడెం గ్రామ తెలుగు యువత నాయకులు పారేపల్లి నరేష్ పేర్కొన్నారు. తెలుగు దేశ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి కాపులకు, వెనుకబడిన వర్గాల వారికి షెడ్యూల్ కులాల వారికి అధిక ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వమేనని అన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవుల్లో కూడా కాపులకు ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని నరేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పాన్ ఇండియా ఔట్‌రిచ్ క్యాంపెయిన్

విశాలాంధ్ర - ఏలూరు : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ , రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి సి. పురుషోత్తమ కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 13వతేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పాన్ ఇండియా ఔట్ రిచ్ క్యాంపైన్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇందులోభాగంగా మంగళవారం ప్యానల్ లాయరు కోన కృష్ణారావు, సి డబ్ల్యు సి చైర్ పర్సన్ రిబ్కరాణి, ఏలూరు మండల తహసీల్దార్ బి. సోమశేఖర్, పారా లీగల్ వాలంటీర్ సురేష్ బాబు ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళా విద్యార్థులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.

అంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు తన ప్రాణాన్ని త్యాగం చేశారని కరస్పాండెంట్ మోపిదేవి విజయలక్ష్మి అన్నారు. రాష్ట్రావతరణ దినోత్సవ వేడుకలు శ్రీ విజేత హై స్కూల్ లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు డా జొన్నకూటి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ తెలుగు మాట్లాడే వారంతా ఒకే రాష్ట్రం గా ఉండాలని పొట్టి శ్రీరాములు నిరాహార దీక్ష చేసి ప్రాణాలు విడిచారన్నారు. ఆ మహనీయుని ప్రాణ త్యాగం తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచామృత అభిషేకాలు

విశాలాంధ్ర- మామిడికుదురు : మామిడికుదురు మండలంలోని అప్పనపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బాల బాలాజీ స్వామి వారికి ఈనెల 4వ తేదీన శుక్రవారం కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పంచామృత అభిషేకాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో నాగ వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం ఆలయ అర్చకులు స్వామి వారికి పళ్ళ రసాలు, ఆవుపాలు, ఆవు పెరుగు, సుగంధరసాలతో పంచమృతాభిషేకం చేస్తారన్నారు. అనంతరం లక్ష తులసి పూజ జరుగుతుందని తెలిపారు.

వైకాపా నుండి టీడీపీలోకి వలసలు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండ లంలోని పేరవరం గ్రామంలో వైఎస్సార్సీపీ పార్టీని వీడి 30 కుటుంబాలకు చెందిన కార్యకర్తలు ప్రత్తిపాడు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి పరుపుల రాజా సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి జ్యోతుల పెదబాబు, సూతి బూరయ్య, కర్రి సుబ్బారావు, కర్రి సుబ్బారావు, అవసరాల సూర్య ప్రకాషరావు తదితరులు ఉన్నారు.

అన్న సమారాధన

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలో వేంచేసి వున్న అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మొదటి మంగళవారం అన్న సమా రాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్న సమారాధనకు పంచకట్ల కనకరాజు దంపతులు ఆర్థిక సహాయం అందజేశారు. ముందుగా ఆలయ పురోహితుడు వైష్ణవదాసు నాగేశ్వరరావు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ అన్న సమారాధన కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జాతీయస్థాయి క్రీడలకు గ్రీన్ ఫీల్డ్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర - కరప : జాతీయస్థాయి క్రీడలకు కరప మండలం వాకాడ గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు 15 మంది ఎంపికయ్యారని మార్షల్ ఆర్ట్స్ క్రీడల్లో ప్రతిభ కనబరిచి బంగారం వెండి పథకాలు సాధించినట్లు సంస్థ చైర్మన్ గ్రంధి బాబ్జి తెలిపారు. నేషనల్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అక్టోబరు నెల 30వ తేదీన రేణిగుంటలో జరిగిన సెకండ్ ఆంధ్ర స్టేట్ టాంగ్ ఐఎల్‌ముడి డివొ చాంపియన్ షిప్-2022 పోటీలలలో గ్రీన్ ఫీల్డ్ స్కూల్ ఇంటర్నేషనల్ విద్యార్థులు 9 మంది బంగారు 6 గురు రజత పతకములను సాధించి జాతీయ స్థాయికి ఎంపిక అయ్యారు. తమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపిక అవ్వటం తమకు చాలా ఆనందంగా ఉందని సంస్థ చైర్మన్ గ్రంధి బాబ్జీగారు అన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయుడు పి కనకప్రసాదును అభినందించారు. ప్రిన్సిపల్ ఎం శిరీష విదార్థినీ విద్యార్థులను అభినందించారు. జిల్లా టాంగ్ ఐఎల్‌ము డిడివొ చాంపియన్ షిప్ సెక్రటరీ ఎం లోకేష్ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : ప్రతి కార్యకర్త తెలుగుదేశం పార్టీ బోలోపేతానికి కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ,జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మంగళవారం కిర్లంపూడి చిల్లంగి జగపతినగరం గ్రామాలలో తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ముందుగా జ్యోతుల నవీన్ పాదయాత్రకు ఘన స్వాగతం అందించి విజయవంతం చేసిన కిర్లంపూడి, చిల్లంగి, జగపతినగరం గ్రామ టిడిపి నాయకులకు, కార్యకర్తలకు అభినందనలు తెలియజేశారు. గత ప్రభుత్వంలో మనం చేసిన అభివృద్ధి నేడు ఈ పాలకులు చేస్తున్న అభివృద్ధి ప్రజలకు వివరించాలన్నారు. పార్టీకి ఆకర్షితులవుతున్న వారిని పార్టీలోకి జాయిన్ చేయాలని పిలుపునిచ్చారు. రేపు రాబోయే రోజుల్లో ప్రతి కార్యకర్త కొంత సమయం కేటాయించుకుని తెలుగుదేశం పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలన్నారు. రాబోయే ఎన్నికల నాటికి తెలుగుదేశం పార్టీ మరింత బలమైన శక్తిగా ఎదగడానికి గ్రామాల్లో తిరిగి ప్రభుత్వ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. సభ్యత్వ నమోదు నవంబర్ నెలాఖరకు పూర్తి చేయాలన్నారు. ఓటర్ల నమోదు ఆధార్‌కు ఓటు హక్కు లింకు చేసుకోవడం వంటి కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ విజయవంతంగా పూర్తి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, ఉప సర్పంచ్ గౌతు జగన్నాథరావు, ప్రజాభిమాని, ఎంపిటిసి కాళ్ళ దొంగబాబు, టిడిపి నాయకులు కుర్ల చినబాబు, తూము కుమార్, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు కుమారి, నాయకులు ఆళ్ళ నానాజీ, శ్రీమన్నారాయమూర్తి, ప్రభాకరరావు, సరిసే శివ, వార్డు మెంబర్లు, జగపతి నగరం, కిర్లంపూడి, చిల్లంగి గ్రామాల కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములును ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : అమరజీవి పొట్టి శ్రీరాములును ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ వైస్ ఎంపీపీ బొద్దేటి గణపతి అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి వైస్ ఎంపీపీ బొద్దేటి గణపతి అధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణపతి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన త్యాగశీలి పొట్టి శ్రీరాములు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి నతీష్ బాబు, పి శ్రీనివాసరావు, రాపేటి ప్రసాద్, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, గృహ నిర్మాణ శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ స్పీకర్ ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - పిఠాపురం : పదవ శక్తి పీఠం శ్రీ కుక్కుటేశ్వర స్వామి దేవస్థానంలో టిడిపి మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, ఆమె కుమార్తె గ్రీష్మ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే వర్మ ఆదేశాల మేరకు ఆ పార్టీ శ్రేణులు ప్రతిభా భారతి మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రతిభా భారతి, గ్రీష్మ శ్రీనివాస మాట్లాడుతూ కార్తీక మాసం చాలా విశేషం అయినందున రాష్ట్రంలో ఉన్న ప్రతీ ఆలయాలను దర్శించి లోక కళ్యాణం కోసం పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితి అసలు బాగోలేదని, ఈ పరిస్థితుల్లో దైవానుగ్రహం కావాలాన్నారు. జగన్ రెడ్డి పాలన పోవాలని ప్రతీ ఆలయంలో మొక్కుకోవడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డం భాస్కర రావు, మడికి ప్రసాద్, బత్తుల చైతన్య రాజేష్ కుమార్, నల్ల శ్రీను, పంపనబోయిన అన్నపూర్ణ, రాయుడు శ్రీను, దుర్గాడ విజయలక్ష్మి, బోడపాటి పద్మ, గాయత్రీ, అరుణ, దోనిపాటి ప్రమీల, బిడిగంటి రవికుమార్, అందుగుల సింహాచలం, కొండెవరం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతపై హర్షం

విశాలాంధ్ర - కాజులూరు : రాష్ట్రంలో కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించడం చాలా సంతోషించదగ్గ విషయమని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డిసిఎం ఎస్ మాజీ డైరెక్టర్ పెంకె సత్యనారాయణ (చిన్నబ్బాయి) అన్నారు. మంగళవారం కాజులూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంతోషం నింపారన్నారు. ముందుగా కల్లుగీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన బీసీ సంక్షేమ శాఖ సినిమాటోగ్రఫీ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కల్లుగీత కార్మికుల ప్రమాద బీమాను ఐదు లక్షల రూపాయల నుండి 10 లక్షలు రూపాయల వరకు పెంచడంతోపాటు కల్లు కిస్తీలను పూర్తిగా రద్దు చేయడంపై కల్లుగీత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుబ్బల సుబ్బారావు, కట్టా సత్యనారాయణ, పితాని వీర రాఘవులు, గుడాల వెంకటరమణ, తదితర కల్లుగీత కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఫోక్సో కేసు నమోదు : డీఎస్పీ విచారణ

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం పి నాగంపల్లి గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న 14 సంవత్సరాల వయసు గల మైనర్ అమ్మాయిని, అదే గ్రామానికి చెందిన అబ్బాయి సదరు మైనర్ బాలిక పై గత కొంతకాలంగా ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని చెప్పి నమ్మించి, పలుమార్లు ఆమెపై అత్యాచారం చేసినట్లు విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు పెద్దల్లో సమక్షంలో తగువు పెట్టగా సమస్య పరిష్కారం కాలేదు. మంగళవారం గండేపల్లి పోలీస్ స్టేషన్లో మైనర్ బాలికపై ఇచ్చిన ఫిర్యాదు పై గండేపల్లి ఎస్సై వై గణేష్ కుమార్ ఫోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. దీనిపై పెద్దాపురం ఎస్డిపిఓ సుంకర మురళీమోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితురాలితో మాట్లాడి తదుపరి విచారణ చేపట్టారు. ఆయనతో పాటు జగ్గంపేట సీఐ బి సూరి అప్పారావు, గండేపల్లి ఎస్సై వై గణేష్ కుమార్, వారి సిబ్బంది పాల్గొన్నారు.

పందుల పెంపకందారులకు హెచ్చరిక

విశాలాంధ్ర - తుని : పట్టణంలో విచ్చలవిడిగా తిరుగాడుతూ పాదచారులు, వాహనదారుల లగేజీల్ని లాక్కుపోతున్న పందులను అరికట్టాలని పట్టణ ప్రజలు నుండి తరచూ వస్తున్న విజ్ఞప్తులు పురస్కరించుకొని మున్సిపల్ చైర్మన్ ఏలూరి సుధారాణి బాలు పందులు అరికట్టే చర్యలు తీసుకోవాలి అని కమీషనర్ బిజెఎస్ ప్రసాదరాజును ఆదేశించారు. మంగళవారం పందుల పెంపకం దారులతో మున్సిపల్ కమీషనర్ బిజెఎస్ ప్రసాదరాజు మున్సిపల్ కార్యాలయంలో సమావేశం అయ్యారు. పట్టణంలో ప్రమాదాలకు, వ్యాధులకు కారణం అవుతున్న పందులు పట్టణంలోకి చొరబడకుండా యజమానులు చర్యలు తీసుకోకుంటే పురపాలక సంఘం రంగంలోకి దిగి తగు చర్యలు తీసుకుంటుందని కమీషనర్ హెచ్చరించారు. పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో పందులను పెంచుకోవాలని, పట్టణంలోకి చొరబడకుండా యజమానులు ఎప్పటి కప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రామంలో శానిటరీ ఇన్స్పెక్టర్ జీవీఆర్ శేఖర్, పందుల పెంపకం దారులు పలువురు పాల్గొన్నారు.

తాడిపూడి కాలువ ఎక్కడ ?

విశాలాంధ్ర - గోపాలపురం : తాడిపూడి కాలవ మాయమైన సంగతి మండలంలోని వాదాలకుంట రోడ్డులో చోటుచేసుకుంది. ప్రజలు, స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం 2005 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తాడిపూడి కాలువను నిర్మించి దానికి అనుబంధ కాలువలను రైతుల అభ్యర్థన మేరకు నిర్మించారు. తాడిపూడి కాలువపై డిస్ట్రిబ్యూటరీ-2 గోపాలపురం నుండి దేవరపల్లి వరకు నిర్మించారు. దీనిపై 2.5 కిలోమీటర్ల వద్ద ఎం-2 మైనర్(సబ్ కెనాల్) కాలువ సుమారు 2 కిలోమీటర్ల మేర ఉంది. కాలువ నిమిత్తం భూములు ఇచ్చిన రైతులకు అప్పటి ప్రభుత్వం నష్టపరిహారాన్ని కూడా చెల్లించింది. 2009 నుండి ఆయకట్టు రైతులకు కాలువ ద్వారా నీరు అందటం ద్వారా తమ పంటలను సాగు చేసుకుంటున్నారు. ఈ ఏడాది వర్జినియా పొగాకుకు అధిక ధర పలకడంతో సుమారు (రూ.250) కేజీ ధర పలుకుగా దురాశతో సుమారు 800 మీటర్ల మేర కాలువ భూమిని పూడ్చివేశారు. దీంతో దిగువ ప్రాంత రైతులకు నీరందకుండా చేశారని వాపోతున్నారు. ఒక ప్రక్క నీటి వినియోగం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు సిబ్బంది దీనిపై పర్యవేక్షణ లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వ ఆస్తులను కాపాడవలసిన అధికార యంత్రాంగం స్పందించి, కాలువ పూడివేతకు కారకులైన వారిపై చర్యలు చేపట్టి కాలువను మరల తిరిగి పునరుద్ధరింపజేసి రైతులకు నీరందించాలని డిమాండ్ చేశారు. దీనిపై సంబంధిత శాఖ ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందించలేదు.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యం

విశాలాంధ్ర-చాగల్లు: ప్రజల ఆరోగ్యానికి పూర్తి రక్షణ కల్పించడమే లక్ష్యంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని డిప్యూటీ డిఎంహెచ్‌వో వరలక్ష్మి తెలిపారు. మంగళవారం చాగల్లు సచివాలయం-3 ఏరియాలో అంగన్వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించి మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లల తల్లులతో , గర్భవతులు, బాలింతలతో మాట్లాడారు. అంగన్వాడి కేంద్రం నుండి పౌష్టికాహారం అవుతుందా లేదా, గర్భవతులు బాలింతలు అంగన్వాడీ కేంద్రంలో భోజనం తింటున్నారా, నెల నెల హెచ్ బి , రక్త పరీక్షలు ఏ ఎన్‌సిలు చేస్తున్నారా తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చాగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ కె. లక్ష్మీ ప్రియ, హెచ్ వి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నాటు సారా స్థావరాలపై పోలీస్ శాఖ దాడులు

విశాలాంధ్ర -ఎటపాక: నాటు సారా స్థావరాల పై ఎటపాక పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఓఎస్డి కృష్ణకాంత్ ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గుండివారి గూడెం గ్రామంలో సీఐ గజేంద్ర కుమార్ నేతృత్వంలో ఎటపాక ఎస్సై పార్థసారథి సారధ్యంలో నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో సుమారు 70 లీటర్ల నాటు సారా,నాటు సారా,8000 తయారీ కి బెల్లపు ఊట ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎటపాక సీఐ గజేంద్ర కుమార్,ఎటపాకఎస్సై పార్థసారథి మాట్లాడుతూ ఆరోగ్యానికి హానికరం చేసే వాటిని తయారీ చేసిన,వాటిని అమ్మకం కానీ,కొనుగోలు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.